క్లుప్తంగా

మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి అర్బన్: అనిసా ఫర్విన్ మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని డాక్టర్ అబ్దుల్ రజాక్ స్టార్ ప్రథమ చికిత్స కేంద్రం, శ్రీచక్ర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మారీసుపేట మఠం బజారులో బుధవారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం డాక్టర్ కమ్మెల హరీష్, డాక్టర్ మిథునేశ్వరరెడ్డి, డాక్టర్ ఎం.పి.ప్రియాంక, డాక్టర్ అపూర్వ, డాక్టర్ మానస సింగం రాజు పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరెల దుర్గ, రేపల్లె సుభాని, టీడీపీ నాయకులు రావి చిన్ని, ఫణిదపు దుర్గాప్రసాద్, జీవన జ్యోతి నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం



కవలలను అభినందిస్తున్న ఎండీ మురళీకాంత్

తెనాలి అర్బన్: అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ఎనిమిది మంది కవల పిల్లలకు మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ గులాబీ పూలను అందించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో బాబూజీ సినిమా చిత్రీకరణ



నటి కావ్యకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు దిలీప్ రాజా

తెనాలిఅర్బన్: బాబూజీ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ముంబాయికి చెందిన నటి కావ్యపై బుధవారం తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కన్వెన్షన్‌లో దర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కిందట జరిగిన పలు సంఘటనలు తెరపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వాతంత్య్రం రాకముందు ఉపయోగించిన కరెన్సీ, భగత్ సింగ్ వాడిన సైకిల్, గాంధీజీ చెప్పులు, పాలకులు ప్రయాణించిన కారులు, బ్రిటిష్ వైస్రాయ్ ఉపయోగించిన తుపాకీలను తమ కళా దర్శకుడి సారథ్యంలో రూపొందుతున్నాయని చెప్పారు. సినిమా కథనంలో స్వాతంత్య్ర ఉద్యమం హైలెట్‌గా ఉంటుందన్నారు. ఇందులో సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబురాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, జగ్జీవన్‌రామ్ తండ్రి శోభిరామ్ పాత్రలు కీలంగా ఉండనున్నట్లు చెప్పారు.

భగవాన్ వెంకటేశ్వరస్వామి ఆశ్రమ వార్షికోత్సవం

తెనాలి టౌన్: సంగంజాగర్లమూడిలోని భగవాన్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆశ్రమంలో బుధవారం 19వ వార్షిక మహోత్సవాన్ని నిర్వహించారు. గంగాధరస్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పూజలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు జంపాల గోపాలరావు, దివ్యజ్యోతి, అనిరుధ్, సమన్వయకర్తలు కొత్తపల్లి వెంకయ్యబాబు, సువర్ణ శివకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

టెండర్లలో పాల్గొనడానికి 28 వరకు గడువు

తెనాలి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో, కొల్లిపర బస్టాండ్ పరిధిలోని పలు షాపుల్ని అద్దెకు ఇచ్చేందుకు టెండర్లను పిలిచినట్లు తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల అప్లికేషన్లు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు ఈనెల 28వ తేదీలోపు తమ అప్లికేషన్లను గుంటూరులోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. వివరాలకు 7382937026, 7382892492 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

బీసీలకు రాజ్యాధికారం జగన్ చలవే..

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 16వ వార్డులో ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్.

తెనాలి అర్బన్: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం అన్ని రాజకీయ పార్టీలకు అలవాటుగా మారిందని, కానీ తమ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులుగా చేశారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 16వ వార్డు ముత్తింశెట్టిపాలెం నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 16వ వార్డు ఇన్‌చార్జిలు కాళిదాసు వెంకట సత్యం, కాళిదాసు విజయ, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నలుగురు ఉప ముఖ్యమంత్రుల్ని చేశారని, 58 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లుగా ఆయా సామాజిక వర్గాల వారిని నియమించారని గుర్తు చేశారు. అనేక కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా బీసీలను నియమించారని చెప్పారు. రాజ్యసభలో కూడా అధిక ప్రాధ్యానం ఇచ్చారని గుర్తు చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో పాటు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీలు ఎదగాలనే పూలే ఆకాంక్షను సీఎం జగన్ నెరవేర్చారని వివరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన సీఎంకు ఆయా వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. 16వ వార్డులో 1265 ఇళ్లు ఉండగా వాటిలో 3727 మంది నివశిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు వార్డులో రూ.21.54 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయేల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, జిల్లా బీసీ వెల్ఫేర్ బోర్డు మెంబర్ బీరంగుల ఆదిలక్ష్మి, 16వ వార్డు నాయకులు బి. ఆదిలక్ష్మి, బట్టు దుర్గారావు, యనమద్రి శ్యాం, రామలింగేశ్వరరావు, మరియదాసు, రాజ్యలక్ష్మి, నారాయణ, అక్కిదాసు శ్యామ్, రాయపూడి బాబు, దారా శ్రీధర్, సిరులు, కన్నయ్య, అచ్యుతరావు, శివమోహన్, తురక శాంతి, వంశీకృష్ణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి

ఎమ్మెల్యే శివకుమార్



దివ్యాంగుడికి ఇళ్ల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం కోపల్లెలో బుధవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. అక్కడే ఉన్న చర్చికి 250 కుర్చీల్ని బహూకరించారు. అనంతరం వికలాంగుల కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. కాలనీలో నివసిస్తున్న 52 మంది దివ్యాంగులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, గ్రామ సర్పంచి చింతల కుమారి, తహసీల్దార్ కె. రవిబాబు, ఎంపీడీవో ఎల్. విజయలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కారుమంచి కిశోర్‌బాబు, కారుమంచి పాల్, సునీత, పాముల మధు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఎన్‌వీఆర్ కళాశాలకు ద్వితీయ స్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సుధాకర్

తెనాలి అర్బన్: ది అసోసియేషన్ ఫర్ ట్రెడిషనల్ యూత్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తెనాలిలోని నన్నపనేని వెంకట్రావు ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు రెండో స్థానాన్ని కై వసం చేసుకుని రజిత పతకాలు సాధించారని కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. పోటీల్ని వరంగల్ జిల్లా ఖాజీపేటలో ఇటీవల నిర్వహించినట్లు ఆయన చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారుల్ని బుధవారం కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ. రామారావు, ఫిజికల్ డైరెక్టర్ కె. అశోక్ పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు

తెనాలి: తెనాలి పట్టణంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవల్ని విస్తృతం చేయాలనే ఉద్దేశంతో చెంచుపేటలోని కెప్టెన్ విజయప్రసాద్ రోడ్డులో బుధవారం తన 240వ శాఖను ప్రారంభించింది. బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన శాఖను ప్రారంభించారు. సభలో ఖాతాదారుల నుద్దేశించి మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్ని వర్గాల ఖాతాదారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.60 శాతం వడ్డీని తమ బ్యాంక్ అందజేస్తోందని చెప్పారు. ఉజ్వల టర్మ్ డిపాజిట్ స్కీమ్‌లో కనీసం రూ.15.10 లక్షల డిపాజిట్‌పై అత్యధికంగా 8.75 శాతం వడ్డీని చెల్లిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత చదువుల నిమిత్తం రెండేళ్లలో 500 మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.60 కోట్ల రుణాల్ని అందించినట్టు చెప్పారు. బంగారు నగల తనఖాపై గ్రాముకు అత్యుత్తమంగా రూ.4150 రుణం ఇస్తున్నామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం తీసుకొచ్చిన పథకాల అమలులో సహకరిస్తున్నట్టు తెలిపారు. ఎనిమిది జిల్లాల్లో 27 లక్షల ఖాతాదారుల ఆదరణతో తమ బ్యాంకు రూ.17 వేల కోట్ల వ్యాపారం సాధించిందని వివరించారు. బ్యాంక్ గుంటూరు రీజినల్ మేనేజరు పి.వీరారెడ్డి, బి.శ్రీనివాసరావు, బి.సువర్ణరాజు, సీహెచ్. యామలయ్య, బ్యాంకు ప్లానింగ్ మేనేజరు కె.ఆంజనేయులు, బ్రాంచి మేనేజరు కె.సురేష్‌బాబు, బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళిని రక్షించేందుకే ఏసుక్రీస్తు ప్రాణ త్యాగం



భట్టిప్రోలు: మానవాళిని రక్షించేందుకు ఏసుక్రీస్తు చేసిన ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు ప్రతి ఏటా నిర్వహించే మండల కాల ఉపవాస దీక్ష ప్రార్థనలు (క్రీస్తు శిలువ శ్రమానుభవ ధ్యానాలు) బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో 40 రోజుల ఉపవాస దీక్షా ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురు మండల అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ మాట్లాడుతూ ఈ ఉపవాస కూడికలు ఈస్టర్ పర్వదినం వరకు కొనసాగుతాయని తెలిపారు. ధ్యానాలు ఏప్రిల్ 7వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

రేపల్లె రూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలోని ఇసుకపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. సెబ్ సీఐ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో ఇసుకపల్లిలో దాడులు నిర్వహించగా కృష్ణాజిల్లా నాగాయలంక మండలం ఈలచెట్లదిబ్బకు చెందిన బడుగు సాంబశివరావు మద్యాన్ని విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 10 సీసాల్ని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

పౌరాణిక నాటక కళాకారుడు మాధవరెడ్డికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం గండికోట రహస్యం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం భలే తమ్ముడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు బొమ్ము మాధవరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లూరి నరసింహారావు, జడి శివరామరాజు, కాకుమాను ఉపేంద్ర, ఉప్పలపాటి శ్రీనివాస్, మోర్ల సుబ్బారావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ఉమ్మలనేని ధర్మారావు, నల్లూరి శ్రీనివాస్, ముళ్లపూడి వెంకట్, మునిపల్లి దుర్గాప్రసాద్, అమ్మిశెట్టి మహేశ్వరరావు, రెడ్రౌతు జగన్మోహనరావు, చాగంటి రాఘవరారెడ్డి, కొప్పరాజు సాంబయ్య పాల్గొన్నారు.

నూతన భవనంలోకి శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం



నూతన భవనంలో ఆశ్రమ వాసులకు భోజనం

తెనాలి: పట్టణ గాంధీచౌక్ సమీపంలోని కొల్లావారి వీధిలో గల శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని నూతన భవనంలోకి తరలించారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి నేతృత్వంలో కొనసాగింది. ముందుగా కొల్లావారి వీధిలోని ఆశ్రమంలో గల గాంధీ, ఆయన సతీమణి కస్తూర్బాల విగ్రహాల్ని పూలతో అలంకరించిన ట్రాక్టరుపై మేళతాళాలతో ఊరేగింపుగా గాంధీచౌక్‌కు వెళ్లారు. అక్కడ పూలమాలలు వేశారు. ఊరేగింపు బుర్రిపాలెం రోడ్డులోని నూతన భవనం వరకు కొనసాగింది. అక్కడ విగ్రహాలకకు ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆశ్రమవాసులు, అతిథులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు గాంధీజీ సేవానిరతిని ఆచరణలో చూపుతున్న వజ్రాల రామలింగాచారి అభినందనీయుడని కొనియాడారు. విశ్వశాంతి కోసం ఆశ్రమంలో నిత్యం అన్నప్రసాద సంతర్పణ దేదీప్యమానం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. రామలింగాచారి తన కుటుంబసభ్యులతో పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆరుమళ్ల సంగిరెడ్డి, మద్దాళి శేషాచలం, కర్రి వేణుగోపాల్, గీతాంజలి మూర్తి, యోగి రమణయ్య, యార్లగడ్డ కోటేశ్వరరావు, మండవ ధనుంజయరావు, కుటుంబరావు, నాగభూషణం, సీహెచ్. రాజు పాల్గొన్నారు.

మహాప్రస్థానంలో శివుడి విగ్రహ ప్రతిష్ట



ట్రాక్టర్‌పై శివుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి టౌన్ : రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలోని హిందూ మహాప్రస్థానంలో బుధవారం మహా శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రూ. 5 లక్షలతో ఏడు అడుగులు, మూడు టన్నుల బరువు గల విగ్రహాన్ని చిలకలూరిపేటలో తయారు చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి కనక తప్పెట్లు, టపాసులు కాలుస్తూ గ్రామంలో ఊరేగించారు. మహిళలు విగ్రహానికి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం మహాప్రస్థానంలో అర్చకులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చక్కా సీతమ్మ, కమిటీ సభ్యులు పి.శంకర్, గోపిశెట్టి నాగేశ్వరరావు, పి.చంద్రశేఖరరావు, వెంకటస్వామి, బ్రహ్మయ్య, రాగం ఆదినారాయణ, వెంకటనారాయణ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు 'మిక్కిలినేని'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామారావు


తెనాలి అర్బన్: నటుడిగా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి నిలిచిపోయారని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాలులో బుధవారం సాయంత్రం ప్రజానాట్యమండలి ప్రముఖుడు రాధాకృష్ణమూర్తి వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కళారంగానికి రాధాకృష్ణమూర్తి ఊపిరిలందించిన వ్యక్తిగా కొనియాడారు. ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యుడిగా సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, టి.వి.వెంకట్, సీహెచ్. శ్రీదేవి, తోట నాగేశ్వరరావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వేస్ట్ పికర్స్‌కు రిక్షా బండ్ల పంపిణీ



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం తెనాలిలో చెత్త ఏరుకునే వారికి ఉచితంగా రిక్షా బండ్లను పంపిణీ చేశారు. రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ వీటిని పంపిణీ చేశారు. చెత్తను ఏరుకుని జీవించే కుటుంబాల (వేస్ట్ పికర్స్)కు రిక్షా బండ్ల పంపిణీ తోడ్పడుతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రాం మేనేజరు సీహెచ్. సామ్యూల్ అనిల్‌కుమార్, ఫైనాన్స్ మేనేజరు నాగలక్ష్మి, రీసెర్చ్ కో–ఆర్డినేటర్లు ప్రవీణ్, విశ్వ, రవితేజ, రమేష్ పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన



వీధి నాటిక ప్రదర్శనతో అవగాహన

తెనాలి: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో నిర్వహించారు. నాబార్డు సౌజన్యంతో వివిధ వీధి నాటికలతో స్థానికులకు అవగాహన కల్పించారు. సీనియర్ బ్యాంకు మేనేజర్లు యు.శ్రీనివాసు, ఎం.గౌరీశంకర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార సొసైటీల ద్వారా ఎకరాకు రూ.10 లక్షలు, విదేశీ విద్యకు రూ.30 లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. డిపాజిట్లపై అన్ని వాణిజ్య బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేటు ఇస్తోందని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు అన్ని బ్యాంకులకన్నా తక్కువ వడ్డీకే రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు వివరించారు.

ఉత్తమ విద్యార్థినులకు నగదు బహుమతులు



బహుమతులను అందజేస్తున్న డాక్టర్ గోగినేని ఉమ

తెనాలి: పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2021–22 సంవత్సరానికి పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన ముగ్గురికి బుధవారం రూ.22 వేలను నగదు బహుమతులుగా అందజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్ని పొందిన విద్యార్థినులు ప్రసన్న కమలశ్రీ, పూజ, మొబిషిరీన్‌లకు నగదును అందజేశారు. గుమ్మడి లక్ష్మీదేవి స్మారకార్థం ఆమె సోదరుడు ఎన్.సుబ్బారావు, భర్త డాక్టర్ గుమ్మడి సాంబశివరావు ఈ బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజకిశోర్, బొల్లిముంత ప్రసాద్ పర్యవేక్షించారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

భట్టిప్రోలు: స్వామి వివేకానంద విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బౌద్ధ స్తూపం సమీపంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఏర్పాటుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బండారు కుమారి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి పాల్గొన్నారు. భూమిపూజను యునెస్కో వాస్తు పండిట్ బ్రహ్మశ్రీ వంగర చలమయ్య సిద్ధాంతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, విగ్రహ సాధన కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, చిదంబరరావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాదగుప్తా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ జగనే సీఎం కావాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున.

భట్టిప్రోలు: భావితరాల కోసం ముందుచూపుతో నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కోరారు. భట్టిప్రోలులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు (చినబుజ్జి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహ సారథులపై ఎంతగానో ఉందని అన్నారు. వేమూరు నియోజకవర్గ పరిశీలకులు చిల్లపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ ఎల్లో మీడియా ప్రతిపక్షాలపై చేస్తున్న అసత్యాలను, ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందచేస్తున్న పథకాలను గురించి ఇంటింటికీ తిరిగే సమయంలో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచి దారా రవి కిరణ్మయి, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి పాల్గొన్నారు.

26న తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 26వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ (అండర్–12), క్యాడెట్ (అండర్–14) విభాగాలలో క్రీడాకారులకు ఈ పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి కలిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. పోటీల్లో ప్రథమస్థానం పొందిన క్రీడాకారులు మార్చి 10 నుంచి విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.